
16 నుంచి డిగ్రీ 2,4, 6 సెమిస్టర్

కర్నూలు(అర్బన్), మే 10: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, 6వ సెమిస్టర్, డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 16 నుంచి జరుగుతాయని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన టైమ్ టేబుల్, హాల్ టికెట్లు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు పంపించామని తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు తీసుకుని పరీక్షా కేంద్రాలకు అరగంట ముందు చేరుకోవాలని సూచించారు.

మట్టి బొక్కేశారు



కర్నూలు, మే 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. ఎమ్మెల్యేల అండతో కొందరు సహజ వనరులను చెరబట్టారు. ఎక్స్‌కవేటర్లు, టిప్పర్ల వంటి భారీ యంత్రాలతో టన్నుల కొద్దీ ఎర్రమట్టి తరలించారు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక, మట్టి, కొండలు, చెరువులను వల్లేదు. కర్నూలు నగరానికి తలమానికమైన జగన్నాథగట్టును మరో కేజీఎఫ్‌గా మార్చేశారు. జిల్లా అంతటా వైసీపీ నాయకులు, వారి అనుచరుల ధనదాహానికి రూ.వందల కోట్ల విలువైన సహజ వనరులు ధ్వంసమైపోయాయి.



- వైసీపీ అండతో ఎర్రమట్టి మాఫియా
- 'కేజీఎఫ్'గా మారిన జగన్నాథగట్టు
- జిల్లా వ్యాప్తంగా కరిగిపోయిన కొండలు
- మాఫియాకు అండగా ప్రజాప్రతినిధులు

కర్నూలు నగర శివారున కల్లూరు మండలం లక్ష్మీపురం రెవిన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబరు 793-1లో 590 ఎకరాల విస్తీర్ణంలో జగన్నాథగట్టు ఉంది. ఎర్రమట్టి, చదును బండ ఉండే ఆ కొండ ప్రభుత్వ పరంబోకు భూమి అని రెవెన్యూ అధికారులే చెబుతున్నారు. అభివృద్ధి పనులు, విద్యా సంస్థలు, ముఖ్య కార్యాలయాలు చేపట్టాలంటే ప్రభుత్వానికి ఈ కొండ ప్రాంతం ఒక్కటే దిక్కు. గత టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదలకు ఇక్కడ దాదాపు 150 ఎకరాల్లో 10 వేల టిడ్కో ఇళ్లు నిర్మించింది. ట్రిపుల్ ఐటీ కళాశాలకు 150 ఎకరాలు, ప్రభుత్వ క్లస్టర్ విశ్వవిద్యాలయానికి 50 ఎకరాలు కేటాయించింది. టిడ్కో ఇళ్లకు ఎదురుగా 165 ఎకరాల్లో ఎర్రగరుసు ఉందని అధికారులు చెబుతున్నారు. దీన్ని భవిష్యత్తు అవసరాలు ల్యాండ్ బ్యాంక్‌గా ఉంచారు. ఈ భూములు కాపాడాల్సిన బాధ్యత రెవిన్యూ అధికారులపై ఉంది. అయితే కీలక ప్రజాప్రతినిధి అండతో జగన్నాథగట్టులో ఎర్రమట్టి మాఫియా పెట్రేగిపోయింది. ఇష్టారాజ్యంగా కొండను తవ్వేశారు. ఒక్కసారి మాత్రమే 1,71,308 క్యూబిక్ మీటర్లకు పైగా అక్రమంగా తవ్వి రవాణా చేశారని మైనింగ్ అధికారులు నిగ్గు తేల్చి రాయల్టీ, అపరాధ రుసుం రూ.19.36 కోట్లు చెల్లించాలని అక్రమార్కులకు నోటీసులు జారీ చేశారు. ఆ తరువాత కూడా ఎర్రమట్టి తవ్వకాలు ఆపేశారా? అంటే అదీలేదు. విచ్చలవిడిగా కొండల్ని కొల్లగొట్టారు. ఓర్వకల్లు మండలంలో చెరువులను కూడా వదల్లేదు. ఎక్కడ మట్టి కనిపిస్తే అక్కడ వైసీపీ మట్టి మాఫియా వాలిపోయి దోచేస్తున్నారు.

ఆదోని కొండల్నీ వదల్లేదు

ఆదోని పట్టణం బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న కొండలను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అనుచరులు కొల్లగొట్టారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, భవన నిర్మాణాలు పెరుగుతున్నాయి. ఎర్ర గరుసుకు డిమాండ్ ఉంది. వైసీపీ నాయకుల అండతో ఎర్ర మట్టి అక్రమార్కులు ఇష్టానుసారంగా తవ్వి కొండ సహజ రూపాన్నే మార్చేశారు. బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న కొండను పూర్తిగా విధ్వంసం చేశారు. అక్కడి నుంచి కొండాపురం, నెట్టేకల్లు రెవిన్యూ గ్రామాల పరిధిలోని కొండలపై పడ్డారు. లక్షల మెట్రిక్ టన్నులు ఎర్రమట్టి తవ్వేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎర్రమట్టి మాఫియా నుంచి కీలక ప్రజాప్రతినిధి కుమారుడు టన్నుకు రూ.వంద కప్పం వసులు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రూ.కోట్లు విలువైన ఎర్రమట్టి కొల్లగొట్టారనే ఆరోపణలు ఉన్నాయి.





కోసిగి తిమ్మప్ప కొండలో ఎర్రమట్టి తవ్వకాలు (ఫైల్)

మంత్రాలయం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అండదండలతో మట్టి మాఫియా పెట్రేగిపోయింది. తుంగభద్రలో ఇసుక, కొండల్ని తవ్వేసి ఎర్రమట్టి కొల్లగొట్టారు. కోసిగి మండలంలో కీలకమైన తిమ్మప్ప కొండ, ఐరన్‌గల్ల కొండ, బసవన్న కొండ, రంగప్ప గట్టులో ఇష్టారాజ్యంగా తవ్వేశారు. ఐదేళ్లలో కొండల్ని పిండి చేసి ఎర్రమట్టి పరిసర గ్రామాలు సహా మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని పట్టణాలకు రవాణా చేసి రూ.కోట్ల విలువైన సహజ వనరులు దోపిడీ చేశారు. అన్నదాతకు సాగు, తాగునీరు

జీఆర్‌పీ దుద్ది రిజర్వాయర్‌నూ వదల్లేదు

అందించే గురురాఘవేంద్ర ప్రాజెక్టు (జీఆర్‌పీ)లో భాగంగా నిర్మించిన దుద్ది రిజర్వాయర్‌ను కూడా వైసీపీ మాఫియా వదల్లేదంటే వీరి ధన దాహం ఎట్లా ఉందో అర్థం చేసుకోవచ్చు. పత్తికొండలోనూ ఇదే పరిస్థితి. గ్రామ శివారులోని ఎర్రకొట్టి కొండను గుల్లచేశారు. కోడుమూరును ఆనుకొని ఉన్న కొండలరాయుడు కొండ, ఎర్రదొడ్డి కొండల్ని తవ్వేశారు. ఎమ్మిగనూరు, ఆలూరు.. ఇలా ఏ నియోజకవర్గానికి వెళ్లినా కోట్ల రూపాయల విలువైన సహజ వనరులను కొల్లగొట్టారు. దీన్నిబట్టి వైసీపీ నాయకులు ఐదేళ్లలో సాగించిన అవినీతి ఏ స్థాయిలో ఉందో ఇట్టే తెలుస్తోంది.



అక్రమ తవ్వకాలతో గుంతలుగా మారిన జగన్నాథగట్టు

కుల మతాల చిచ్చు రేపుతున్న వైసీపీ

- ముస్లిం రిజర్వేషన్లకు టీడీపీ అనుకూలం
- జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు

కర్నూలు(అర్బన్), మే 10: కుల, మతాల మధ్య చిచ్చురేపి ఓట్లు దండుకోవాలనే లక్ష్యంతో వైసీపీ పని చేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్లలో జిల్లాకు ఏమీ చేయకుండా ముస్లింలను లక్ష్యం చేసుకొని మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. తెలుగుదేశం పార్టీ ముస్లిం రిజర్వేషన్లకు అనుకూలమని, టీడీపీ హయాంలోనే రంజాన్ తోఫా, దుల్హాన్ లాంటి ఎన్నో పథకాలు అందించిందని గుర్తు చేశారు. ముస్లింలను తప్పదారి పట్టించేందుకు వైసీపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ కులం, మతం పేరుతో రాజకీయాలు చేసి లబ్ధి పొందాలనుకునే జగన్‌కు కర్నూలు ప్రజలు ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జగన్ వస్తే ల్యాండ్ టైటిలింగ్ చట్టం ద్వారా మన ఆస్తులను తాకట్టు పెడతాడని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, సత్రం రాజకృష్ణుడు, డీ జేమ్స్, ముంతాజ్, సంజీవలక్ష్మి, సోమిశెట్టి నవీన్, ఎల్లప్ప, మారెన్న, కుంపటి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభంజనంలా టీడీపీ

కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు



బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కింద సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తున్న కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

గూడూరు, మే 9: రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం సృష్టించి అధికారంలోకి రాబోతుందని కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామంలో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటి కింద సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించే కార్యక్రమం చేపట్టగా కర్నూలు పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, టీడీపీ విజయాన్ని ఎవ్వరూ అపలేరన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె కృష్ణ, కురువ వెంకట్రాముడు, ఎంపీటీసీ మద్దిలేటి, కె ఎం రవి, కర్ణం చిన్న గిడ్డయ్య, ఓబులేష్, నాగేష్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రిసెప్షన్ సెంటర్లలో పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.సృజన



సూచనలు ఇస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), మే 10: రాయలసీమ యూనివర్సిటీలోని రిసెప్షన్ సెంటర్లలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాధారణ ఎన్నికల దృష్ట్యా రాయలసీమ యూనివర్సిటీలో అన్ని నియోజకవర్గాలకు ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లు, పార్కింగ్ ప్రదేశాన్ని ఆమె ఎస్పీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాయలసీమ యూనివర్సిటీలో అన్ని నియోజకవర్గాలకు ఏర్పాటు చేస్తున్న ఈవీఎం రిసెప్షన్ సెంటర్లను పరిశీలిస్తూ వర్షాన్ని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా ప్రతి బ్లాక్‌కు పవర్ బ్యాక్ అఫ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షం పడినప్పుడు నీరు నిల్వ ఉండకుండా, రిసెప్షన్ సెంటర్‌లోకి రాకుండా చుట్టూ ట్రెంచ్ వేయించాలని ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశం నుంచి రిసెప్షన్ సెంటరకు వర్షంలో ఈవీఎంలు తడవకుండా ఉండేందుకు రేకులతో ఒక దారిని ఏర్పాటు చేయాలని అన్నారు. రిసెప్షన్ సెంటర్ల దగ్గర ఉన్న తాత్కాలిక ఫుడ్ కోర్టును తొలగించి చివరికి ఏర్పాటు చేయాలన్నారు. బస్సులు సులభంగా లోపలికి వచ్చేలా లెవెలింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశం నుంచి సిబ్బంది రిసెప్షన్ సెంటరుకు సులభంగా చేరేలా పెద్దసైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ జి. కృష్ణకాంత్, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, డీటీసీ శ్రీధర్, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావడం ఖాయం

- రాయలసీమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 10: టీడీపీ గెలిచి చంద్రబాబు నాయుడు సీఎం కావడం ఖాయమని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం స్థానిక మౌర్యఇన్ పరిణయ ఫంక్షన్ హాలులో రాయలసీమ హక్కుల ఐక్యవేదిక, రాయలసీమ అభివృద్ధి యువజన సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం వెనుకబడిన రాయలసీమ హక్కుల సాధనే లక్ష్యంగా రాయలసీమ ఐక్య హక్కుల వేదికను ప్రారంభించినట్లు తెలిపారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో అందరినీ ఒక వేదిక పైకి తీసుకొచ్చి రాయలసీమలో సమ్మర్ క్యాపిటల్, మినీ సెక్రటేరియేట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశానన్నారు. కర్నూలులో న్యాయ రాజధానిని ఏర్పాటు చేస్తామని జగన్ చెప్పి అమలు చేయలేదని అన్నారు. ఈ ఎన్నికల్లో అన్ని పార్టీలు రాయలసీమ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. లేకపోతే రాయలసీమలో మళ్లీ ఉద్యమాలు చేయాల్సి వస్తుందని టీజీ వెంకటేశ్ తెలిపారు. కర్నూలు జిల్లాలో గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించాలని అన్నారు. సిద్ధేశ్వరం ప్రాజెక్టు గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక.. హంద్రీనీవా కాలువల పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాయలసీమ విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాములు, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. చంద్రప్ప, కోనేటి వెంకటేశ్వర్లు, ఆర్‌పీపీస్ అధ్యక్షుడు రవికుమార్, విద్యార్థి యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

నేడు నంద్యాలకు చంద్రబాబు



నంద్యాల (నూనెపల్లె), మే 10: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం నంద్యాలకు రానున్నారు. సార్వత్రిక ఎన్నికల పర్యటనలో భాగంగా శనివారం ఒంగోలులో పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 12.15 గంటలకు నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గంలో బయలుదేరి స్థానిక రాజ్ థియేటర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ప్రజాగళం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 12.30 నుంచి 1.30 వరకు జరిగే బహిరంగ సభ అనంతరం హెలిప్యాడ్‌కు చేరుకుని 1.55కు చిత్తూరుకు బయలుదేరనున్నారు. గత ఏడాది నంద్యాలలోని రాజ్ థియేటర్ సర్కిల్‌లో బహిరంగ సభ అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో చంద్రబాబు నాయుడు బస చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీఐటీ అధికారులు సెప్టెంబరు 9న తెల్లవారు జామున ఆయనను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఏడు నెలల తర్వాత చంద్రబాబు ఎన్నికల ప్రచారం నిమిత్తం శనివారం నంద్యాలకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.4

పాఠకుని పూర్తి పేరు : ....
డోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

కర్నూలు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఆదోని				
2. ఆలూరు				
3. పత్తికొండ				
4. కోడుమూరు (ఎస్సీ)				
5. ఎమ్మిగనూరు				
6. కర్నూలు				
7. మంత్రాలయం				
8. ఆళ్ళగడ్డ				
9. బనగానపల్లి				
10. డోన్				
11. శ్రీశైలం				
12. నందికొట్కూరు (ఎస్సీ)				
13. నంద్యాల				
14. పాణ్యం				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయము : ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం : 1/1 & 1/2, ఇండస్ స్కూల్ దగ్గర, గుత్తి రోడ్డు, పందిపాడు గ్రామ పంచాయితి, కల్లూరు (మం.), కర్నూలు -518002.



సైకిలే మన గుర్తు



గూడూరులో టీడీపీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు సైకిల్‌ను చూపుతూ కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని గెలిపించాలని కోరారు.

అన్నా మీ గెలుపు ఖాయం



కోడుమూరు మండలం వర్కూరు గ్రామంలో టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని సన్మానిస్తున్న కార్యకర్తలు

బీసీకి గజమాలతో స్వాగతం



బనగానపల్లె మండలంలోని పలుకూరు గ్రామంలో బీసీ జనార్దన్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

మీ ఆశీర్వాదం కావాలి



మంత్రాలయం మండలం వి.తిమ్మాపురంలో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి

టీడీపీ జెండా ఎగరాలి



బేతంచెర్లలో డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఆయన కుమార్తెను భారీ గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు. డోన్‌లో టీడీపీ జెండాను ఎగరవేయాలని కార్యకర్తలకు కోట్ల పిలుపునిచ్చారు.

ముస్లింలకు అండగా ఉంటా



ఆత్మకూరులో శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ముస్లింలతో ర్యాలీ చేశారు. ముస్లింలకు ఎల్లప్పుడూ అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

బుజ్జికన్నా బాగున్నావా...



కర్నూలులోని శ్రీనివాస మార్కెట్, షరాఫ్‌బజార్‌లో టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ ఇంటింటి ప్రచారం చేశారు. ఓ చిన్నారితో ముచ్చటించారు. 'ఒక్క అవకాశం ఇవ్వండి అక్కా మీ కష్టాలన్నీ తీరుస్తా'నని ప్రజలను కోరుకున్నారు.

మా నాన్నను గెలిపించండి



బనగానపల్లె మండలం రామవరంలో బీసీ జనార్దన్‌రెడ్డి కోసం ప్రచారం చేస్తున్న కుమార్తెలు మనోరమ, మాధవి



మల్లన్న ఆశీస్సులు ఎవరికో?

ఆత్మకూరు

శ్రీశైలానికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రంతోపాటు తెలుగు రాష్ట్రాలకు వెలుగులను ఇచ్చే శ్రీశైలం జలాశయం, దేశంలోనే అతిపెద్దదైన నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్‌తోపాటు మరెన్నో చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రదేశాలు శ్రీశైల నియోజకవర్గంలో ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన శ్రీశైల నియోజకవర్గంలో రాజకీయ వేడి ఊపందుకుంది. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు పోటాపోటీగా ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఎవరికి వారు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రజల దగ్గరికి వెళ్లి తమ వాగ్దానాలను వినిపిస్తున్నారు. ఈ ఎన్నికల్లో శ్రీశైల మల్లన్న ఆశీస్సులు ఎవరికన్నది మరో నాలుగు రోజుల్లో తేలనుంది.

- రెండు దశాబ్దాల తర్వాత టీడీపీకి జోష్
- ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న బుడ్డా
- గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే శిల్పా
- ఆసక్తిగా మారిన శ్రీశైల నియోజకవర్గ రాజకీయం

రెండు దశాబ్దాల తర్వాత ..

నందికొట్కూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆత్మకూరు తాలుకా 1978లో తొలిసారిగా నియోజకవర్గంగా ఏర్పడింది. ఆ తర్వాత 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో శ్రీశైలం నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం పది సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా అందులో ఐదు సార్లు కాంగ్రెస్, మూడు సార్లు టీడీపీ, రెండు సార్లు వైసీపీ గెలిచాయి. తొలి నుంచి ఈ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండటంతో 1978లో మాజీ మంత్రి ఆత్మకూరు వెంగళరెడ్డి, 1989లో మాజీ ఎమ్మెల్యే బుడ్డా వెంగళరెడ్డి, 1994, 2004, 2009 ఎన్నికల్లో ఏరాసు ప్రతాపరెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా నిలిచి విజయబావుట ఎగురవేశారు. అదేవిధంగా టీడీపీ ఆవిర్భావం తర్వాత 1983, 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బుడ్డా వెంగళరెడ్డి పోటీ చేసి గెలిచారు. అతర్వాత మాజీ ఎమ్మెల్యే బుడ్డా వెంగళరెడ్డి మరణాంతరం ఆయన కుమారుడు బుడ్డా సీతారామిరెడ్డి 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఈ క్రమంలోనే 2014 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి గెలిచినప్పటికీ ఆ తర్వాత టీడీపీలో చేరారు. 2019లో వైసీపీ తరపున పోటీ చేసిన శిల్పా చక్రపాణిరెడ్డి గెలిచారు. అయితే ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈసారి జరిగే ఎన్నికలు భిన్నంగా కనిపిస్తున్నాయి. రెండు దశాబ్దాల తర్వాత నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేసేలా కార్యకర్తల్లో ఉత్సాహం కనిపిస్తోంది.


ఎమ్మెల్యే శిల్పాకు గడ్డు కాలం..?

శ్రీశైల నియోజకవర్గంలో ఈ సారి జరిగే ఎన్నికల్లో వైసీపీకి గడ్డుకాలం కనిపిస్తోందని చెప్పవచ్చు. ఎందుకంటే ఐదేళ్లలో ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ చెప్పుకోదగ్గ అభివృద్ధి అంశాలేవి కనిపించడం లేదు. దీంతో చేసేది ఏమీలేక కొన్ని అంశాలపైనే వైసీపీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రత్యేకించి టీడీపీ, బీజేపీ పొత్తుపై ముస్లిం మైనార్టీల్లో దుష్ప్రచారం చేసి టీడీపీకి ఓట్లు పడకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా డబ్బులను కూడా విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అసంతృప్తి నాయకులకు ప్యాకేజీలు, ప్రచారాల్లో పాల్గొనే వారికి మద్యం, డబ్బు కావాల్సినంతగా ఇస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇవే గాకుండా ఎన్నికలకు ముందు చాలా చోట్ల తనకు అనుకూలంగా ఉన్న పోలీసు, ఇతర అధికారులను నియమించుకున్నట్లు సమాచారం. వారి ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని పావులు కదువుతున్నారు. కాగా ఎమ్మెల్యే శిల్పా ఎక్కడి నుంచో వలస వచ్చిన స్థానికేతరుడని మాజీ ఎమ్మెల్యే బుడ్డా ప్రజల్ని చైతన్యపరుస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఈ అంశం ప్రజల్లో చర్చకు దారితీస్తోంది. ఏదిఏమైనా.. నువ్వా.. నేనా..! అన్నట్లుగా సాగే ఈ ఎన్నికల్లో శ్రీశైల మల్లన్న ఆశీస్సులు ఎవరికి ఉంటాయో వేచి చూడాలి.



ప్రజల్లో ఊహించని మార్పు :

కాంగ్రెస్ పార్టీకి 2014లో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు ఊహించని విధంగా షాక్ ఇచ్చారు. కాంగ్రెస్ వల్లే రాష్ట్రానికి అన్యాయం జరిగిందని భావించి ఆ పార్టీని కాదని గంపగుత్తగా మెజార్టీ ఓటర్లు వైసీపీ వైపు వెళ్లారు. 2014, 2019 ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించారు. అయితే ప్రస్తుతం సీన్ రివర్స్ అయింది. 46 ఏళ్ల శ్రీశైల నియోజకవర్గ చరిత్రలో కాంగ్రెస్, టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి మినహాయిస్తే వైసీపీ హయాంలో ప్రస్తుతం చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏమీ జరగలేదు. ఈ పరిస్థితుల్లో వైసీపీకి ఓటేసినా ఫలితం ఉండదన్న భావనతో ఇక్కడి ఓటర్లు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉండటంతోపాటు స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తీరుపై ఇక్కడి ప్రజలు మండిపడుతున్నారు. ప్రత్యేకంగా చెప్పాలంటే ఆత్మకూరులో ముస్లింల మైనార్టీల జనాభా అధికం. వీరు మొదటి నుంచి కాంగ్రెస్, వైసీపీ వైపే ఎక్కువగా మొగ్గు చూపారు. అయితే ఈసారి అత్యధికంగా ముస్లిం మైనార్టీలు టీడీపీలో చేరారు. అలాగే ఎస్సీలు కూడా తొలి నుంచి కాంగ్రెస్, వైసీపీల వెంటే నడిచినా ఈసారి వారిలో కూడా మార్పు కనిపిస్తోంది. దీంతో ఈమార్పు ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో టీడీపీ విజయానికి సంకేతమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



రండి బాబూ రండి..!

కారు కావాలంటే పంపిస్తాం
ఎక్కువ మంది ఉంటే బస్సు కూడా..
గ్రామీణ ఓట్లకు భారీ డిమాండ్



ఆదోని, మే 10: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమైనదేనని అభ్యర్థులు గుర్తిస్తున్నారు. ఏ ఓటును వదులుకోరాదన్న ధృఢ సంకల్పంతో పార్టీ అభ్యర్థులు ప్రతి గ్రామంలో ఉన్న ఓటర్లను రప్పించి ఓట్లు వేయించాలని కార్యకర్తలకు ఆదేశాలిచ్చారు. పట్టణంలో నివాసం ఉంటూ గ్రామాల్లో ఓటు హక్కున్న ప్రతి ఓటర్‌ను గ్రామాలకు రప్పించడానికి ప్రత్యేక ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరైతే హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో సమావేశాలు జరిపి విందులిచ్చారు. పోలింగ్ రోజు ఉదయమే ప్రతి నలుగురు, ఐదుగురు ఓటర్లకు ఓ కారు చొప్పున వారి ఇంటి వద్దకే వాహనాన్ని పంపి, గ్రామాలకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ఒక్కో గ్రామానికి 30 మందికి మించి ఉంటే ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేస్తామని హామీలిచ్చారు. దీంతో ట్రావెల్స్ సంస్థలకు భారీ డిమాండ్ పెరిగింది. పట్టణం, నగరం నుంచి నేరుగా వచ్చే వారికి బస్సు, రైలు లాంటి సౌకర్యాలు కల్పించడం.. ఫ్యామిలీలు, ఎక్కువ ఓట్లు ఉన్న వారికి కార్లు సమకూరుస్తామని చెబుతున్నారు. ఓటేసిన తర్వాత తిరిగి నగరంలో దింపేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే, రెండు చోట్ల ఓట్లు ఉన్న వారే స్థానికంగా ఓటుకు డబ్బులు వస్తే ఇక్కడే ఉందామని, లేకుంటే రవాణా చార్జీలతో పాటు అధిక మొత్తంలో వస్తే ఊరికి వెళ్లేలా ప్లాన్ చేసుకుంటున్నారు. రెండు చోట్ల ఓట్లు ఉన్న వారంతా ఓటుకు పలుకుతున్న విలువలను లెక్కలేసుకుంటున్నారు. ద్విముఖ పోటీ ఉన్న దగ్గర ఇరు పార్టీల నుంచి, త్రిముఖ పోటీ ఉన్న దగ్గర మూడు పార్టీల నుంచి డబ్బులు తీసుకోవడానికి ఫోన్లలోనే సంప్రదింపులు చేస్తున్నారు.

రెండు ప్రాంతాల్లో ఓట్లు.. తేల్చుకోలేక సతమతం

కర్నూలులో పని చేస్తున్న జనార్దన్‌ది సొంత ఊరు ఆదోని పరిధిలోని పెద్దహరివాణం. పదేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలు నగరంలో నివాసం ఉంటున్నారు. అయితే, ఎన్నికల సందర్భంగా ఆయన ఉంటున్న ప్రాంతంలో అమ్మా నాన్నతో పాటు భార్య ఓటు నమోదు చేయించారు. ఓటు నమోదు చేసుకున్న సందర్భంలోనే ఊరిలో ఓటు తొలగించారని భావించారు. కానీ నాలుగు రోజుల క్రితం గ్రామం నుంచి ఓ పార్టీ అభ్యర్థి అనుచరులు ఫోన్ చేసి ఇక్కడ ఓటు ఉందని, వేసి వెళితే నలుగురికి రవాణా చార్జీలు అందిస్తామని చెప్పారు. అయితే ఊరికి వెళ్లి ఓటు వేయాలా..? లేకుంటే ఇక్కడే ఉండి ఓటు వేయాలా.. అనే అంశంపై జనార్దన్ కుటుంబం సందిగ్ధంలో పడింది... ఇదే తరహాలో నగరంలోని పలువురు ఓటు ఎక్కడ వేయాలా.. అనే అంశంపై సందిగ్ధంలో పడ్డారు. ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చిన వారికి ఇటు నగర పరిధిలో ఓటు నమోదు చేసుకోగా సొంత ఊళ్లలో కూడా ఓట్లు ఉన్నాయి. ఇలా రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉన్న వారంతా ఎక్కడ ఓటు వేయాలనే అంశాన్ని కొందరూ తేల్చుకోలేకపోతున్నారు. ఊళ్లలో ఓటేసేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు ఫోన్లు చేసి మరీ పిలుస్తున్నారు. అయితే నగరంలో ఓటు ఉన్నా కానీ, ఎక్కడ వేద్దామంటే ఇప్పటి వరకు ఎవరూ కూడా తమను సంప్రదించలేదని, ఊరికి వెళ్లాలంటే రెండు రోజుల పనిపోతుందని వాపోతున్నారు.

● నగరంలో పట్టించుకోవట్లే..

నగర పరిధిలో ఓటు ఉన్నా కానీ, వివిధ నియోజకవర్గాల్లో అభ్యర్థులు అంతగా ప్రాధాన్యమివ్వడం లేదు. కొన్ని ప్రాంతాలు, కొన్ని కాలనీలు, కొన్ని బస్తీల్లోనే ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నగరానికి వలస వచ్చి స్థిరపడిన ఓటర్లను ఆయా ప్రాంతాల్లోని అభ్యర్థులు పట్టించుకోవడం లేదు. వారికి ఊళ్లలో కూడా ఓటు ఉందనే సమాచారముంటే చాలు.. ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు.

మసీదులో వైసీపీ నాయకుడి ప్రచారం



మసీదులో ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకుడు

నందికొట్కూరు, మే 10: నందికొట్కూరులో నిబంధనలకు విరుద్ధంగా మసీదులో వైసీపీ నాయకులు ప్రచారం చేపట్టారు. శుక్రవారం పట్టణంలో బైరెడ్డి నగర్‌లోని మసీదు ప్రార్థనల అనంతరం మసీదులోనే ముస్లింలకు వైసీపీ నాయకుడు అబూబకర్ వైసీపీకి ఓటు వేయాలంటూ ప్రచారం చేపట్టారు. అయితే ప్రార్థనా స్థలాలు, దేవాలయాలు, తదితర ప్రాంతాల్లో ప్రచారం చేయడం నిసిద్ధం. అయితే వైసీపీకి ముస్లిం మైనార్టీలు మద్దతు తెలపాలంటూ వైసీపీ నాయకుడు ప్రచారం మొదలుపెట్టారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులపై విషప్రచారం చేసినట్లు తెలుస్తోంది. ముస్లింల ఓట్లను ప్రభావితం చేసేందుకు ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా ప్రార్థనా స్థలాల్లో ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తోంది.

నేటితో ముగియనున్న ప్రచారం

కర్నూలు, మే 10 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రచార ఘట్టానికి శనివారం సాయంత్రం ఆరు గంటలకు తెర పడనుంది. దాదాపు రెండు నెలలు పాటు ప్రచారం సాగించిన అభ్యర్థులు ప్రస్తుతం ప్రలోభాలపై దృష్టి సారించారు. జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యేల స్థానాల కోసం 121 మంది బరిలో నిలిచారు. విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీ అభ్యర్థులు ప్రలోభాలకు పదును పెట్టారు. ముఖ్యంగా అధికార వైసీపీ నాయకులు ఓ అడుగు ముందుకు వేసి ఓటుకు రూ.2 వేలు పంచుతున్నట్లు తెలిసింది. వారికి దీటుగా టీడీపీ నాయకులు కూడా సిద్ధమైనట్లు సమాచారం. అదే క్రమంలో గంపగుత్త ఓట్లపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. బెంగళూరు, హైదరాబాదు నగరాల్లో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను స్వగ్రామాలకు రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

దోసె వేసెయ్



నంద్యాలలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జె.లక్ష్మి నరసింహ యాదవ్ శుక్రవారం ప్రచారం చేపట్టారు. ఓ హోటల్‌లో దోసెలు వేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

విక్టరీ మనదే..

ఆళ్లగడ్డలో టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ శుక్రవారం ప్రచారం సాగించారు. ఓటర్లకు అభివాదం చేస్తూ ఇలా కనిపించారు.






ఆదోని, మే 10: ఎమ్మెల్యే పదవి కోసం, అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా డబ్బులు కుమ్మరిస్తున్నారు. ఎన్నికల వ్యయ పరిమితి రూ.40 లక్షలే కాగా ఖర్చులు మాత్రం రూ. కోట్లకు కోట్లు దాటుతున్నాయి. జిల్లాలోని ప్రధాన పార్టీల మధ్య పోటీ నువ్వా.. నేనా.. అన్నట్లుగా ఉంది. లక్షలు గుమ్మరించి హోరెత్తించిన ప్రచార ఘట్టం ఆఖరు దశకు చేరగా, ఇక అతి ముఖ్యమైన పోల్ మేనేజ్‌మెంట్ కోసం లెక్కకు మించి ఖర్చు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



ఓట్ల కోసం ధన ప్రవాహం!



● సౌండ్ పార్టీలు....

ప్రస్తుత ఎన్నికలలో ఎన్నడూ లేనంత వ్యయంతో ఖరీదైనవిగా రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. టిక్కెట్లు కేటాయించడంలో పార్టీలు ధనం ఉన్న వారికే ప్రాధాన్యం ఇవ్వడంతో వారంతా ఖర్చులో పోటీ పడుతున్నారు. ఒక్కొక్కరు వందల కోట్ల విలువ గల స్థిర, చర ఆస్తులు, పెద్ద మొత్తంలో డబ్బులు ఉన్నట్లు అఫిడవిట్లలో పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం అభ్యర్థులు రూ.40 లక్షలు మాత్రమే ఖర్చు చేయాలి. కానీ అభ్యర్థుల ఖర్చు మాత్రం రూ.40 కోట్ల మార్కు దాటడం ఖాయంగా కనిపిస్తోంది.

● జంపింగ్ లీడర్లకు ప్యాకేజీలు...



మండల, గ్రామ స్థాయిలో ఏ కాస్త బలం ఉన్న నాయకులున్నా... వారి మద్దతుకై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి సారించారు. వారితో మాట్లాడి పార్టీల్లోకి చేర్చుకుంటున్నారు. స్పెషల్ ఆఫర్లతో కొందరు లీడర్లు పొద్దున ఒక పార్టీలో ఉంటే, సాయంత్రం మరో పార్టీకి మారుతున్నారు. ఎవరు ఏ పార్టీలో ఉన్నారో గుర్తించలేనంత వేగంగా కండువాలు మారుస్తున్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు ఇలా పదవులను బట్టి రేటు కట్టినట్లు తెలుస్తోంది. ఫిరాయింపులకే అభ్యర్థులు పెద్ద మొత్తంలో వ్యయం చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

● రోజు ఖర్చు రూ.లక్షల్లోనే...

ప్రజల దృష్టిని ఆకర్షించడానికి అభ్యర్థులు రోజువారీగా గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికి చేస్తున్న ప్రచారానికి, బలనిరూపణ కోసం నిర్వహించే ర్యాలీలు, రోడ్‌షోలకు లక్షలకు లక్షలే ఖర్చు చేస్తున్నారు. తక్కువలో తక్కువ ర్యాలీల్లో 800 నుంచి వెయ్యి మంది వరకు ఉంటున్నారు. వారిని ఒక్కొక్కరికి రూ.300 నుంచి రూ.500 వరకు నగదుతో పాటు టిఫిన్లు, భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. కొందరికి మద్యం సీసాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. స్పెషల్‌గా తమ అనుచరులు, కార్యకర్తలకు మందు, విందుల కోసం డబ్బులను ఫుల్లుగా వెచ్చిస్తున్నారు.

● వ్యయ పరిమితి రూ.40 లక్షలే... ● ఖర్చు మాత్రం రూ. కోట్లలో...

ఎన్నికల నియమావళి ప్రకారం బరిలో నిలిచిన వారు ఇష్టారీతిన డబ్బు ఖర్చు పెట్టడానికి వీలు లేదు. ప్రస్తుత నిబంధనలు అనుసరించి వ్యయ పరిమితి గరిష్ఠంగా రూ.40 లక్షలుగా నిర్ణయించారు. ఆపై ఖర్చు చేస్తే వారిపై అనర్హత వేటు వేస్తారు. అభ్యర్థులు సభలు, సమావేశాలు, ప్రచార సామగ్రికి చేస్తున్న ఖర్చులను అధికారులు ఎప్పటికప్పుడు రికార్డు చేసుకుంటున్నారు. నామినేషన్ వేసిన నాటి నుంచి పోలింగ్ జరిగే వరకు అభ్యర్థి చేసే ప్రతీ ఖర్చును ఎన్నికల వ్యయంగానే పరిగణిస్తారు. పార్టీ జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలు, భోజనాలు,

● లెక్కదాటితే అనర్హత వేటే...

వాహనాల అద్దె, సభా వేదికలు, పత్రికల ప్రకటనలను ఎన్నికల ఖర్చుల్లోనే లెక్కిస్తారు. వీటన్నింటికి బిల్లులు సమర్పించాల్సి ఉంటుంది. ఈసీ నిర్దేశించిన ధరల ఆధారంగానే లెక్కలు కడుతారు. అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేసేలా మద్యం, నగదు, వివిధ రకాల బహుమతులను ఇచ్చి ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉండటంతో ఈసీ ఇలాంటి చర్యలపై ప్రత్యేక నిఘా పెట్టింది. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అనుమతులు, సరైన ఆదారాలు లేని నగదును సీజ్ చేస్తున్నారు. బ్యాంకుల ద్వారా రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు జరుగుతున్న లావాదేవీలను పరిశీలిస్తున్నారు. అధిక మొత్తంలో డ్రా చేసే వారి వివరాలను బ్యాంకు నుంచి సేకరిస్తున్నారు. అక్రమంగా జరిగే లావాదేవీలపై అధికారులు విచారణ జరిపి ఏదైనా అనుమానం ఉంటే వెంటనే ఖాతా సీజ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల అనంతరం అభ్యర్థుల నుంచి ఖర్చుల లెక్కలు తీసుకుంటామని గరిష్ఠ పరిమితి మించి వ్యయం చేసినట్లు తేలితే వారిని ఈసీ అనర్హులుగా ప్రకటించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

● గరిష్ఠ వ్యయ పరిమితి రూ.40 లక్షలు..



ఇంతితై వటుడింతింతై అన్నట్టు అసెంబ్లీ ఎన్నికల వ్యయం భారీగా పెరుగుతోంది. తొలి ఎన్నికల్లో గరిష్ఠ వ్యయ పరిమితి రూ.లక్ష మాత్రమే ఉండగా, నలభై రేట్లు పెరిగి రూ.40 లక్షలకు చేరింది. పెరుగుతున్న ధరల దృష్ట్యా ఈసీ కూడా ఎన్నికల వ్యయ పరిమితిని పెంచుతూ వస్తోంది. 1952 సాధారణ ఎన్నికల సమయంలో అసెంబ్లీ అభ్యర్థుల వ్యయ పరిమితి రూ.లక్ష మాత్రమే. ఇది 1962 నాటికి రూ.3 లక్షలు, 1971 ఎన్నికల్లో రూ.4 లక్షలకు, 1975 నాటికి రూ.5 లక్షలకు చేరింది. 1984 అసెంబ్లీ ఎన్నికల్లో రూ.5 లక్షలుగా ఉన్న వ్యయ పరిమితిని ఏకంగా రెట్టింపు చేసి రూ.10 లక్షలకు పెంచారు. 1991లో రూ.12 లక్షలు, 1999లో రూ.15 లక్షలు, 2007లో రూ.17 లక్షలు, 2009లో రూ.26 లక్షలు, 2014లో రూ.28 లక్షల వ్యయ పరిమితిగా నిర్ణయించారు. ఇది ప్రస్తుత ఎన్నికల్లో రూ.40 లక్షలుగా నిర్దేశించారు. పేరుకే వ్యయపరిమితి కాగా లక్షల నుంచి పదుల కోట్లకు అభ్యర్థుల ఖర్చులు చేరాయి.

● అగ్రనేతల సభలకు కోట్లే..

ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ తమ అగ్రనేతలతో ప్రచార సభలు నిర్వహించారు. ఒక్కో మీటింగ్‌లో 30 వేల నుంచి 50 వేల వరకు ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. వేల మంది జన సమీకరణ, కుర్చీలు, టెంట్లు, స్టేజీ ఏర్పాట్లు, అలంకరణ, మైక్‌సెట్లు, డ్రోన్లు, వీడియోలు ఇలా ప్రతీ దానికి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. జనాల తరలింపు, వారిని వాహనాలు, భోజనాల ఏర్పాట్లు, మద్యం పంపిణీ ఒకరిని మించి మరొకరు చేస్తున్నారు. ఒక్కో అభ్యర్థి అగ్రనేతలు, స్టార్ క్యాంపెయినర్ల సభలకు కోట్ల రూపాయలు వ్యయం చేస్తున్నారు. పార్టీ ఖర్చులతోనే సభ ఏర్పాటు చేసినట్లు చెప్పుకుంటారు. కాని అభ్యర్థులే ఖర్చు భరిస్తారనేది బహిరంగ రహస్యం.

ఎక్కడికెళ్లినా ఎన్నికల చర్చలే..



ఆదోని, మే 10: నలుగురు ఎక్కడ కలిసినా.. సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల గురించి చర్చ.... హోటల్స్, బార్బర్ షాపు, గ్రామాల్లో, రచ్చబండ దగ్గర... ఇలా ఏ నలుగురు కలిసినా రాజకీయంపైనే చర్చ జరుగుతోంది. ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లు మాత్రమే కాకుండా, స్థానిక రాజకీయాలతోపాటు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అంశాలు కూడా చర్చించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్నికలే ప్రధాన అంశంగా చర్చ సాగుతోంది. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది. ఎవరు ఏ నియోజకవర్గంలో గెలుస్తారు. అంటూ జోరుగా, హుషారుగా ముచ్చట్లు సాగిస్తున్నారు. అసెంబ్లీని మించిన వాదోపవాదాలు, సవాళ్లు, ప్రతి సవాళ్లు ఇక్కడ కనిపిస్తున్నాయి.

అలకబూనిన అమరావతి నగర్ కౌన్సిలర్

ఆదోని, మే 10: ప్రచార నిమిత్తం అమరావతి నగర్‌కు వస్తున్నట్టు ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి కనీస సమాచారం కూడా ఇవ్వలేదని ఆ వార్డు కౌన్సిలర్ లలిత మధుసూదన్ శర్మ అలకబూనారు. శుక్రవారం ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అమరావతి నగర్ వార్డులో పర్యటించారు. అయితే స్థానిక కౌన్సిలర్‌కు సమాచారం ఇవ్వకపోవడంతో అగౌరవ పరిచినట్టుగా ఆమె భావించారు. అయితే ఒక్క అమరావతి నగర్ కౌన్సిలరే కాదు... మిగతా కౌన్సిలర్లు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నట్టు తెలుస్తోంది. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికే గౌరవ మర్యాదలు దక్కుతున్నాయని, వార్డు కౌన్సిలర్లు అనే కనీస గౌరవం కూడా తమకు ఇవ్వడం లేదని వారు అంతర్మథనం చెందుతున్నారు. వీరంతా సమయం కోసం వేచి చూస్తున్నారని, మే 13న తమకు జరిగిన అవమానానికి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

పట్టణంలో రూ.2 వేలు.. పల్లెల్లో రూ.1500

అధికార పార్టీపై జోరుగా ప్రచారం



నందికొట్కూరు, మే 10: 2024 సార్వత్రిక ఎన్నికలు తుది దశకు చేరుకోనున్నాయి. ఇక ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచార గడువు శనివారం సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. సాధారణంగా ప్రచారం ముగిశాక డబ్బుల పంపిణీ తెరపైకి వస్తుంది. కాని ఈ సారి ఒక వైపు ప్రచారం జరుగుతుండగానే... మరో వైపు ఓటర్లకు డబ్బుల పంపిణీ కార్యక్రమానికి అధికార పార్టీ నాయకులు తెరలేపినట్లు తెలుస్తోంది. నందికొట్కూరు పట్టణంలో టీడీపీ బలంగా ఉన్న చోట అధికార పార్టీ రూ.2 వేలు పంపిణీ చేస్తున్నట్లు, గ్రామాల్లో రూ.1500 పంపిణీ జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

జాగ్రత్త ఓటరూ...!



జాడలేని నేతలు
నీ జాడ తెలుసుకొని
మీ వీధిలో చేతులు జోడించి
మీ ముంగిట
ముగ్గులా మెరుస్తున్నారు..
ఓటుకు నోటుతో మీకు
ముకుతాడు వేసి
మురికివాడలోని పిల్లల ముడ్డు
కడిగేస్తున్నారు..
చిరువ్యాపారులతో కలిసి తేనీటిని
సేవిస్తున్నారు...
కాళ్లకు చెప్పులు కూడా కొనలేని
పేదవాడి పాదాలను
అప్రయత్నంగా తాకుతున్నారు...
నెరవేరని హామీలన్నీ
నెమరువేస్తూ చెప్పేస్తున్నారు
సమాధానమై నిలవాలి
నీ ఓటు ఆయుధం..
సాహసించకపోతే నీ ఉనికికే
ప్రమాదం

- దాసరి వెంకట రమణ, కర్నూలు

వలస కూలీలు వచ్చేశారు..



గోనెగండ్ల, మే 10: ఓటు వేయడానికి వలస కూలీలు సొంత గ్రామాలకు వచ్చేశారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల నుంచి దాదాపు 25 వేల మంది వలసలు వెళ్లారు. ఈ 13న జరగబోయే ఎన్నికలకు వైసీపీ నాయకులు వారిని సొంత గ్రామాలకు రప్పించారు. అలాగే నందవరం, ఎమ్మిగనూరు రూరల్ నుంచి ఎక్కువ మంది వలస కూలీలు వలసలు వెళ్లారు. వారు కూడా శనివారం రాత్రి కానీ మరుసటి రోజు ఉదయం కానీ వారి సొంత గ్రామాలకు చేరనున్నట్లు తెలుస్తోంది. వీరికి ప్రయాణ ఖర్చులు, భోజనం, మద్యం ఖర్చులు భరించడంతోపాటు ఓటుకు ఇంత మొత్తం ఇస్తామని చెప్పి పిలిపిస్తున్నట్టు సమాచారం.

కరుణించండి..!



- ఇష్టదైవాలపై భారం వేసిన అభ్యర్థులు
- దీవెనలందించాలని పూజలు
- నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ముడుపులు

ఆదోని, మే 10: ప్రచారం బాగా చేశాం.. కాలికి బలపం కట్టుకొని ఇంటింటికీ తిరిగాం. డబ్బులు కూడా అందరికీ పంచాం. ఇక ఓటర్ల దయ. అంతకంటే ఎక్కువగా నమ్ముకున్న దేవతల దీవెన... గెలుపోటముల బాధ్యత ఆ ఇద్దరిపైనే.. నమ్మిన ప్రజలు సోమవారం ఓట్లు వేసి గెలిపిస్తారో.... ఇష్టదైవాలు అండగా నిలుస్తారో... లేదో వేచి చూడాలి.. ప్రస్తుతం అభ్యర్థుల నోటి నుంచి వస్తున్న మాటలివి. పోలింగ్‌కు మరికొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్న తరుణంలో అభ్యర్థులు అనుచరులతో మాట్లాడుతున్న మాటలు ఆసక్తి రేపుతున్నాయి. ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాలో పలు నియోజకవర్గాల్లో టఫ్ ఫైట్ నడుస్తోంది. నెల రోజుల క్రితం వరకు గెలుపును పక్కన పెట్టి మెజారిటీ లెక్కలు వేసుకుని ఊహాలోకంలో విహరించిన నేతలు హడలిపోతున్నారు. ప్రత్యర్థుల నుంచి గట్టి పోటీ ఎదురవుతుండడంతో అసలు గెలుస్తామా...? లేదో అన్న ప్రశ్నతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

● దేవుళ్లకు ముడుపులు కట్టి..

ఓటర్లపై నమ్మకం పెట్టుకున్న అభ్యర్థులు ఇష్టదైవాలను కూడా గట్టిగా మొక్కుతున్నారు. తమను గెలిపించాలని కొందరు ముడుపులు కట్టినట్లు తెలుస్తోంది. గెలిచిన తర్వాత మీ సన్నిధికి వచ్చి ముడుపులు చెల్లిస్తానమని పూజిస్తున్నారు. కాగా, అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు కూడా పూజల్లో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. తమ వాడిని గెలిపిస్తే గుర్తింపుగా ఏదైనా చేయిస్తామని ప్రార్థిస్తుండడం ఆసక్తికరంగా మారింది.

● టెన్షన్ తప్పదు

సోమవారం పోలింగ్ అనంతరం జూన్ 4న వెలువడే ఫలితాల వరకు టెన్షన్ తప్పదంటూ అభ్యర్థులు వాపోతున్నారు. ప్రచారంలో తమకు ప్రజల నుంచి అపూర్వ స్పందన అభించిందని, ఫలితాలు అనుకూలంగా ఉంటాయని ఓ వైపు పైకి చెబుతున్నప్పటికీ... లోలోపల తీవ్ర ఉత్కంఠకు లోనవుతున్నారు. ఆదోని, మంత్రాలయం, ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు లాంటి నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు టెన్షన్‌తో గడుపుతున్నట్లు సమాచారం.







రాఘవేంద్రుడి కటాక్షం

ఎవరికో..?

మంత్రాలయం, మే 10: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి కటాక్షం ఎవరికోనని నియోజకవర్గ అభ్యర్థులు ఉత్కంఠగా ఉన్నారు. గత ఉమ్మడి జిల్లాల పునర్విభజన కంటే ముందు మంత్రాలయం ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఉండేది.. 2009లో పునర్విభజన అనంతరం టీడీపీకే ఇక్కడి ప్రజలు పట్టం కట్టారు. 2014, 2019 జరిగిన ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. అయితే.. 2024 ఎన్నికల్లో బీసీ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన రాఘవేంద్ర రెడ్డి పోటీలో ఉండగా వై.బాలనాగిరెడ్డి వైసీపీ నుంచి బరిలో నిలిచారు. నియోజకవర్గంలో అత్యధికంగా బీసీలే ఉండటం, అందులో వాల్మీకి ఓట్లే గెలుపు ఓటములు ప్రధానం కావడంతో ఈ నియోజకవర్గంలో మంత్రాలయంలో పోటీ రసవత్తరంగా మారింది. ఒకవైపు బీసీలు, మరో వైపు రెడ్డి సామాజిక వర్గాలు ఢీ అంటే ఢీ అనే స్థితిలో ప్రచారాలు సాగిస్తున్నాయి.



రాఘవేంద్ర బలాలు..

తన తండ్రి దివంగత ఎస్.రామిరెడ్డి గతంలో పీఆర్పీ నుంచి పోటీ చేయడం, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా పని చేయడం వల్ల ప్రజలకు దగ్గరయ్యారు. గతంలో బీవీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రాలయం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల్లో అభివృద్ధి చేయడం వాల్మీకి సామాజికవర్గంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఓట్లు అనుకూలంగా ఉన్నాయి.

బలహీనతలు..

మొదటిసారిగా పోటీ చేయడం, గతంలో వైసీపీలో నాలుగున్నరేళ్లుగా కొనసాగి పార్టీ మారగానే.. ఎమ్మెల్యే టికెట్ దక్కడం. కేవలం బీసీ సామాజికవర్గాలపైనే ఫోకస్ చేయడం

బాలనాగిరెడ్డి బలాలు..

మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై.. నాలుగోసారి తానే గెలుస్తానన్న నమ్మకం.. రాంపురంరెడ్డి సోదరులు అంటే శత్రువులకు సైతం సేవలందిస్తారనే పేరు ఉండడం సేవా కార్యక్రమాలు చేయడం. పార్టీలకతీతంగా అందరినీ కలుపుకోవడం..

బలహీనతలు..

మూడుసార్లు ఎమ్మెల్యే అయినా... అభివృద్ధి చేయకపోవడం.. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉండటం. ఆర్డీఎస్, పులికనుమ, గురు రాఘవేంద్ర ప్రాజెక్టులు నిర్మాణానికి నిధులు మంజూరు హామీని గాలికొదిలేసి తాగు, సాగునీరు అందించకపోవడం.



ఎన్నికల తీరుపై అధికారులతో సమీక్షిస్తున్న డీఐజీ విజయరావు

స్వేచ్ఛగా ఓటు వేయండి : డీఐజీ

ఆదోని, మే 10: ఈనెల 13వ తేదీ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు పిలుపునిచ్చారు. ఆదోనిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శుక్రవారం డీఐజీ సీహెచ్ విజయరావు, ఎస్పీ కృష్ణకాంత్ కలిసి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఎన్నికల ఏర్పాట్లపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల దగ్గర పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గురించి సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శివ నారాయణ స్వామి, శ్రీనివాసరెడ్డి, బీ సీతారామయ్య, సీఐ గోపీనాథ్, ఎస్ఐలు ఉన్నారు.

ఎన్నికల సామగ్రిని పకడ్బందీగా పంపిణీ చేయాలి

కర్నూలు(న్యూసిటీ), మే 10: కర్నూలు అసెంబ్లీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు తరలించే ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ ఆదేశించారు. పంపిణీ కేంద్రంలో విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు శుక్రవారం పాత కౌన్సిల్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేశామన్నారు. సెక్టార్ల వారీగా కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఔట్‌డోర్ స్టేడియంలో పంపిణీ కేంద్రం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

గూడూరులో టీడీపీ ప్రచారం

గూడూరు, మే 10: గూడూరులోని ఆయా కాలనీల్లో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, అధికార ప్రతినిధి దండు సుందరరాజు, రేమట వెంకటేశ్వర్లు, సృజన్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుందరరాజు, రేమట వెంకటేశ్వర్లు, సృజన్, పౌలు, టీడీపీ కౌన్సిలర్లు కోడుమూరు షాషావలి, బుడ్డంగలి, మన్సూన్ బాషా, నాగప్ప యాదవ్, తెలుగు శ్రీనివాసులు, చాంద్ బాషా, కుర్వ హనుమంతు, వెంకీ, గిడ్డయ్య, వీరకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వరస్వామి జయంతి

టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు పూజలు



బసవేశ్వరుడి చిత్రటానికి పూజలు చేస్తున్న బస్తిపాటి నాగరాజు

కర్నూలు(అర్బన్), మే 10: హైందవ మతాన్ని సంస్కరించిన వారిలో బసవేశ్వరస్వామి ఒక్కరని కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం నగరంలోని వీరభద్రస్వామి ఆలయంలోని బసవేశ్వరుడి చిత్రటానికి వీర శైవ లింగాయత్ సంఘం నాయకులతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కుల వ్యవస్థను, వర్గ విభేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది బస వేశ్వర స్వామి అని కొనియాడారు.

సి.బెళగల్: మండలంలోని గొల్లలదొడ్డిలో బసవేశ్వరస్వామి జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తరలివచ్చిన భక్తులకు ఆకుల బసయ్య, విశ్వేశ్వరుడు, నాగసాయి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులు స్వామివారికి పూజలు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(న్యూసిటీ), మే 10: కర్నూలు డివిజన్ పరిధిలోని పోస్టల్ శాఖలో తపాలా జీవిత బీమా(పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ) ఏజెంట్లు, ఫీల్డ్ ఆఫీసర్లుగా కమీషన్ ప్రాతిపదికన పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు డివిజన్‌లోని పలు ప్రాంతాలలో కమీషన్ పద్ధతిన డైరెక్ట్ ఏజెంట్లను నియమిస్తామన్నారు. డైరెక్ట్ ఏజెంట్లు పదో తరగతి పాసై 18 సంవత్సరాలు దాటిన వారు, ఫీల్డ్ ఆఫీసర్లకు సెంట్రల్/రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి అయి ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 27న పాతబ స్టాండు ప్రధాన తపాలా కార్యాలయంలో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఎంపిక చేసిన ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్ రూ.5 వేలు ఎన్ఎస్‌సీ రూపంలో(రీఫండబుల్) చెల్లించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఏజెంట్లకు కమీషన్ ఇస్తారన్నారు. వివరాలకు డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి..హరిక్రిష్ణారెడ్డి 7013029312కు సంప్రదించాలని సూచించారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

సి.బెళగల్, మే 10: మండలంలోని ముడుమాల, వై.కొట్టాల, బ్రాహ్మణదొడ్డి, ఈర్లదిన్నె, పోలకల్, కొండాపురం, పల్‌దొడ్డి గ్రామాల్లో టీడీపీ నాయకులు రేపల్లె పౌలు, ఈర్లదిన్నె శేషన్న శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాణిక్యప్రభు మాట్లాడుతూ టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందు, రాజులు, భాస్కర్, బీరప్ప పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● వెలకట్టలేనిది అమ్మ మనసు
● అమ్మలకు అండగా ఉండాలనే మహాశక్తి పథకం
● అమ్మ స్ఫూర్తితో ఆడపడుచులకు అండగా ఉంటా

అమ్మ ప్రేమలా సూపర్ సిక్స్ వరాలు

మాతృమూర్తుల దినోత్సవం సందర్భంగా కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్



కర్నూలు, మే 10 (ఆంధ్రజ్యోతి): అమ్మంటే తెలుసుకో.. జన్మంతా కొలుచుకో..! ఎవరు రాయగలరు అమ్మా అనే మాట కన్న కమ్మని కావ్యం.. ఎవరు పాడగలరు అమ్మా అనురాగం తీయని రాగం..! అంటూ అమ్మ గొప్పతనాన్ని ఈ పాట వ్యక్తం చేస్తుంది. అమ్మ ఆప్యాయత.. అనురాగం.. ఆనందం.. ఆత్మీయత.. ఆదర్శం.. కమ్మదనం.. తియ్యదనం.. అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. మాటలకు అందనిది అమ్మ ప్రేమ. అందుకే అమ్మలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంగా టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల్లో కీలకమైన మహాశక్తి పథకం చేర్చి ఆడపడుచులకు అండగా నిలిచారు. అదే స్ఫూర్తితో కర్నూలు నియోజకవర్గంలో అమ్మలకు కొడుకుగా, అక్కచెల్లెళ్లకు సోదరుడిగా అండగా ఉంటానని మాతృమూర్తుల దినోత్సవం పురస్కరించుకొని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అంటున్నారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆ వివరాలు ఇలా..

● **ఆంధ్రజ్యోతి ప్రతినిధి: అమ్మ ప్రేమ, అనుబంధం వివరిస్తారా..?**

● **టీజీ భరత్:** అమ్మ..! ఈ పదమే ఓ వైబ్రేషన్. అమ్మ ప్రేమను వర్ణించడానికి ఏ డిక్షనరీలో పదాలు సరిపోవు. అంతటి గొప్పమూర్తి అమ్మ. తన రక్త మాంసాలు పంచి పునర్జన్మ నెత్తుతూ బిడ్డకు జన్మనిస్తుంది. పొత్తిళ్లలో పసికందును చూసి ప్రసవవేదనను మరిచిపోతుంది. అమృతం ఎలా ఉంటుందో తెలియదు గాని.. అమ్మ ప్రేమ ముందు అది దిగుదుడుపే. ఇక నా విషయానికి వస్తే మా అమ్మ టీజీ రాజ్యలక్ష్మి గారు నాకు జన్మనిచ్చిన తల్లి మాత్రమే కాదు.. గురువు, దైవం. నాన్న ఉన్నతంగా తీర్చిదిద్దినా అమ్మ తరువాతే. నాకే కాదు.. సమాజంలో ఎవరికైనా అమ్మ తరువాతే దేవుడు. అంతటి గొప్ప మూర్తి అమ్మ.

● **అమ్మ వంటింటికే పరిమితం అంటారు..! దీనికి మీరేమంటారు..?**

● **టీజీ:** అది ముమ్మాటికి తప్పు. అమ్మ వంటింట్లో కమ్మనైన వంట తయారు చేసి బిడ్డలకు నచ్చిన ఆహారం తయారు చేసి ఇష్టంగా వడ్డించి ఆకలి తీర్చే అన్నపూర్ణదేవి. అంతటి గొప్ప వ్యక్తిని నిర్లక్ష్యం చేయడం తగదు. ఇంట్లో ప్రతి ఒక్కరి ఇష్టాలు, అయిష్టాలు, బలాలు, బలహీనతలు అమ్మకు తెలుసు. మనకు ఏది అవసరమో.. కాదో గుర్తించగలిగే దేవత అమ్మ. మనకు ఏది అవసరమో అమ్మతో చెప్పి ముందుకు సాగితే విజయాలు వరిస్తాయి.

● **నేటి మహిళలు స్వయం కృషితో రాణించాలని తపిస్తున్నారు. దీనిపై మీ అభిప్రాయం?**

● **టీజీ:** ఇది వంద శాతం కరెక్ట్. ఒకనాడు పురుషాధిక్య ప్రపంచంలో స్త్రీలు అణచివేతకు గురైన మాట నిజమే. నేడు పరిస్థితులు మారాయి. ఎంచుకున్న రంగం ఏదైనా పురుషులతో సమానంగా సక్సెస్ వైపు అడుగు లు వేస్తున్నారు. అంతరిక్షానికి వెళ్లి వచ్చారు. ఇల్లాలి చదువు.. ఇంటికి వెలుగు అని పెద్దలు అన్నారంటే స్త్రీ గొప్పతనం తెలుస్తుంది. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అత్యున్నతంగా రాణిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలిచారంటే స్త్రీలల్లో ఉన్న గొప్పతనం అది. అందుకే ప్రతి ఆడబిడ్డను చదివించాలి.. స్వయం కృషితో రాణించేలా ప్రోత్సాహం అందించాలి. అలాంటి వారికి నా సహకారం ఉంటుంది.

● **మీరు టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.. టీడీపీ మహిళా సంక్షేమానికి చేసే కృషి వివరిస్తారా..?**

● **టీజీ:** నాడు ఎన్టీఆర్.. నేడు చంద్రబాబు మహిళల అభ్యున్నతి, అభివృద్ధి కోసం ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ఆస్తిలో సమాన హక్కు, స్థానిక సంస్థల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్ల కల్పించారు. ప్రతిభా భారతిని శాసనసభ స్పీకర్ చేసిన ఘనత టీడీపీదే. చంద్రబాబు తీసుకొచ్చిన ఐటీ విప్లవం వల్ల ఎందరో మహిళలు సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఉన్నతంగా స్థిరపడ్డారు. అదే స్ఫూర్తితో ఈ ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలు చేర్చారు. నేను కర్నూలు ఎమ్మెల్యేగా గెలిచాక మహిళల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తాను.

● **అమ్మ, నాన్నల నుంచి మీరు నేర్చుకున్నది ఏమిటీ..?**

● **టీజీ:** అమ్మ టీజీ రాజ్యలక్ష్మి ఓ మనిషిగా సమాజంలో ఎలా ఉండాలో.. ఎలాంటి సేవ చేయాలో నేర్పారు. నాన్న టీజీ వెంకటేశ్ జన్మభూమి రుణం తీర్చుకోమని నేర్పించారు. నాన్న సొంత డబ్బుతో వీధి వీధినా మంచినీటి కేంద్రాలు ఏర్పాటు చేశారు. కళ్యాణ మంటపాలు కట్టించారు. విద్య, వైద్యం కోసం ఆర్థిక సాయం అందించారు. డబ్బు సంపాదించడమే కాదు.. ఆ డబ్బు పదుగురికి ఉపయోగ పడాలి. ఉచితంగా డబ్బు ఇస్తే మనుషులు సోమరిగా తయారవుతారు. వారిలో నైపుణ్యాన్ని గుర్తించి ఉపాధి, ఉద్యోగాలు ఇవ్వమన్నారు. అందుకే ఇక్కడే పరిశ్రమలు, వ్యాపార సంస్థలు పెట్టి వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. వృద్ధాప్యంలో అమ్మనాన్నలను ఆశ్రమాల్లో చేరుస్తున్నారు. అది ముమ్మాటికి తప్పు. అమ్మనాన్నలకు చివరి అంకంలో సేవలు చేస్తే దేవుడి సేవతో సమానం.



అమ్మ రాజ్యలక్ష్మితో టీజీ భరత్

కల్లూరు మండలంలో వైసీపీకి షాక్

గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన 30 కుటుంబాలు



గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన యాపర్లపాడు, సల్కాపురం వైసీపీ నాయకులు

కల్లూరు, మే 10: కల్లూరు మండలానికి చెందిన 30 కుటుంబాలు పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థ పుచ్చు కున్నారు. సల్కాపురం గ్రామానికి చెందిన జయన్న, మధు, పర్సు, లోకేష్, రాము దతోపాటు 10 కుటుంబాలకు గౌరు దంపతులు టీడీపీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బతుకన్న, దేవేందర్‌రెడ్డి, శేఖర్, మౌలాలి పాల్గొన్నారు.

● కల్లూరు మండలం యాపర్లపాడు గ్రామానికి చెందిన టీజీ వెంకటేష్, మనోహర్, మోహన్, బాలతో పాటు 20 కుటుంబాలు గౌరు వెంకటరెడ్డి సమక్షం లో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకుడు డి.రామాంజనేయులు పాల్గొన్నార



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న గౌరు చరిత

● డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే ఏపీ అభివృద్ధి: గౌరు జనార్దన్‌రెడ్డి

ఎన్‌డీఏ ఆధ్వర్యంలోని డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని గౌరు చరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 21 వార్డు ఎస్‌బీఐ కాలనీలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించి, సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే విద్య, వైద్యం, యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

పాణ్యం కోటపై టీడీపీ జెండా ఎగరేద్దాం: గౌరు చరిత

కల్లూరు: పాణ్యం కోటపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేద్దామని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరుచరిత స్పష్టం చేశారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 20వ వార్డు కమలానగర్, మహాలక్ష్మీనగర్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, ట్రైబల్ వెల్ఫేర్‌కాలనీలో ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఇంటింటికి తిరిగి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా జనసేన అధ్యక్షుడు చింతా సురేష్, కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, శ్రీకాంత్, వసుందర, సువర్ణ, నరసింహులు, బీజేపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, మదన్‌మోహనాచారి పాల్గొన్నారు.



21వ వార్డు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గౌరు జనార్దన్‌రెడ్డి

వైసీపీ వస్తే రాష్ట్రం సర్వనాశనమే

● ప్రజల ఆస్తులు, ప్రకృతి వనరులను దోచేస్తారు
● కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి



దిగువపాడులో ప్రచారం చేస్తున్న దస్తగిరి

కర్నూలు(రూరల్), మే10: వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వనాశనమేనని, ఏపీలో ప్రజల ఆస్తులు, ప్రకృతి వనరులు దోచుకోవడమే వైసీపీ నాయకుల నైజమని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి మండి పడ్డారు. కర్నూలు రూరల్ మండలం దిగువపాడు, పి.రుద్రవరం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో నియోజకవర్గంలో వైసీపీ నాయకులు ప్రభుత్వ భూములను ఎక్కడిపడితే అక్కడ కబ్జాలు చేశారని ఆరోపించారు. వైసీపీ ప్రజాప్రతినిధులకు వారి ఆస్తులను పెంచుకోవడం తప్ప నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధి చేపట్టలేదన్నారు. వైసీపీ నాన్‌లోకల్ అభ్యర్థిని పోటీకి దింపిందని ఆ పార్టీకి ఓటువేస్తే చిన్న చిన్న పనులకు కూడా ప్రకాశం జిల్లాకు కోడుమూరు ప్రజలు వలస వెళ్లాల్సివస్తోందన్నారు. లోకల్ అభ్యర్థిగా కూటమి బలపరిచిన తనను గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటానని అన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు'

కోడుమూరు(రూరల్): చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు అని టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం వర్కూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగిస్తున్నారని తెలిపారు. రైతుల పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ బొమ్మ ఎందుకని ప్రశ్నించారు. అనంతరం బైనదొడ్డి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జే రాముడు, జీపు క్రిష్ణ, అశోక్, చెన్నరాయుడు, మద్దూరు హనుమంతు, నాగరాజు, గడ్డమయ్య, రామ చంద్రుడు, ప్రతాప్, మద్దిలేటి, రామాంజనేయులు, వెంకటేశ్వరరెడ్డి, అయ్యప్ప, తోటయ్య, చిన్నతోటయ్య, చాకలి రామక్రిష్ణ పాల్గొన్నారు



ఎన్నికల ప్రచారంలో బొగ్గుల దస్తగిరి

ఒక్క అవకాశం ఇవ్వండి

సి.బెళగల్: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే.. కోడుమూరు నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతామని టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం మండలంలోని బూరందొడ్డి గ్రామంలో మండల కన్వీనర్ గోవిందుగౌడు ఆధ్వర్యంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్ర మంలో టీడీపీ సీనియర్ నాయకులు వెంకటప్ప, రామ్మోహన్ రెడ్డి, శరత్, సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీటీసీ ఈరన్నగౌడు పాల్గొన్నారు.

వ్యాపారులకు భరోసా : టీజీ భరత్



భరోసా యాత్రలో మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మే 10: టీడీపీ అధికారంలోకి వస్తే వ్యాపారులకు భరోసా ఉంటుందని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని శ్రీనివాస మార్కెట్, షరాఫ్ బజార్‌లలో టీజీ భరత్ భరోసా యాత్ర నిర్వహించారు. వ్యాపారా సముదాయాల వద్దకు వెళ్లి వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. తనయుడు టీజీ విభూతో కలిసి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని మేనిఫెస్టో రూపొందించారన్నారు.

రజకులను విస్మరించిన ప్రభుత్వం



హుశేనాపురంలో బట్టలు ఇస్త్రీ చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, మే 10: వైసీపీ ప్రభుత్వం రజకులను విస్మరించిందని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా హుశేనాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రజకుల కాలనీకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని బట్టలను ఇస్త్రీ చేశారు. రజకుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్ద స్వామి, నాయకులు మహబూబ్‌బాషా, కేవీ మధు, బజారు, జగదీష్, నాగ రాజు, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్

కర్నూలు(కలెక్టరేట్), మే 10: ఎన్నికల పోలింగ్ సన్నద్ధతపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవో, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులతో శుక్రవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజున వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో ఈవీఎంలు తీసుకుని వచ్చే సమయంలో తడవకుండా బస్సు చుట్టూ టార్పాలిన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో కొన్ని గొడుగులు కూడా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి మూడు బెల్ ఇంజనీర్లను కేటాయించామన్నారు.

మైక్రో అబ్జర్వర్లకు రెండో విడత శిక్షణ

కర్నూలు(కలెక్టరేట్), మే 10: స్థానిక పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని ఆడిటోరియంలో శుక్రవారం మైక్రో అబ్జర్వర్లకు అధికారులు రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జాఫర్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లకు చెక్‌లిస్టు రూపంలో నివేదికలు ఇస్తామన్నారు.

పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్ట్ ఏర్పాటు: పాణ్యం నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌కాస్ట్ ఏర్పాటు చేశామని జేసీ నారపురెడ్డి మౌర్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గ సెక్టార్ ఆఫీసర్లు, స్టాటిక్ సర్వేలియన్స్ టీమ్స్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ సమీక్ష సమావేశం నిర్వహించారు.

'కర్నూలు అభివృద్ధి కోసం టీజీని గెలిపించుకుందాం'

కర్నూలు(కల్చరల్), మే 10: కర్నూలు నియోజకవర్గ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, కొత్త పరిశ్రమల స్థాపన జరగాలంటే టీడీపీ అభ్యర్థి టీజీ భరత్‌ను గెలిపించుకోవాలని జిల్లా బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం వన్‌టౌన్, కుమ్మరి వీధి, చిత్తారి వీధి, పూలబజార్ తదితర ప్రాంతాల్లో బ్రాహ్మణ సంఘాల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు కంచుగంటల శ్యామసుందర్ రావు, చల్లా నాగరాజ శర్మ, చెరువు వెంకట దుర్గాప్రసాద్, పరశురామ కమిటీ అధ్యక్షుడు డి.ఆనందరావు, సము ద్రాల శ్రీధర్‌బాబు, రాష్ట్ర అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు టీవీ రవిచంద్రశర్మ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 10: 2024-25 విద్యాసంవత్సరానికి గానూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కర్నూలు జిల్లా ప్రైవేటు ఐటీఐ మెనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ దామోదర్ చౌదరి, కర్నూలు జిల్లా ప్రైవేటు ఐటీఐ మేనేజ్మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆదినారాయణ శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి పాసైన అభ్యర్థులు లేదా ఇంటర్, డిగ్రీ పాసైనా, ఫెయిలైనా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. దరఖాస్తులు చేసుకోవడానికి జూన్ 10న చివరి గడువు అన్నారు. మహిళా అభ్యర్థులకు ప్రతి ట్రేడ్‌లో 33 శాతం రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. వివరాల కోసం మీ సమీపంలోని ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారాలు బంద్

● ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ఆదోని, మే 10: పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందే రాజకీయ ప్రచారాలు నిలిపివేయాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. శుక్రవారం సాయంత్రం సబ్ కలెక్టర్ చాంబర్ నందు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో ప్రచారాల కోసం వచ్చిన నాయకులు మే 11వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటల లోపే తమ ప్రచారం ముగించుకొని ఆదోని నుండి వెళ్లిపోవాలన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ఎటువంటి ప్రచారాలు, ప్రకటనలు జరగకూడదని అన్నారు. పోలింగ్ కేంద్రానికి ఉదయం 5 గంటల లోపే ఏజెంట్లు హాజరు కావాలన్నారు.ఏజెంట్ సమక్షంలోనే మాక్ పోల్ నిర్వహిస్తామన్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభిస్తామన్నారు. మార్చి 13వ తేదీన వర్షం పడే సూచనలు ఉన్నందున ఓటర్లు తమ ఓటు హక్కును త్వరితగతిన వినియోగించుకోవాలని సూచించారు. ఓటింగ్ శాతం పెంచడానికి మీవంతు సహకారాలు అందజేయాలని కోరారు.

ఆలూరులో 294 పోలింగ్ కేంద్రాలు

దేవనకొండ, మే10: ఆలూరు నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలలో 13న ఎన్నికలు జరగనున్నాయి. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 2 లక్షల 58 వేల 670 మంది ఓటర్లు సోమవారం వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కును వినియోగించనున్నారు. ఆలూరు 47, ఆస్పరి 65, చిప్పగిరి29, దేవనకొండ 62, హాలహర్వి44, హోళగుంద47 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 29 సెక్టారియాల్ రూట్‌లు ఉన్నాయి.

ల్యాండ్ టైటిల్‌యాక్ట్‌పై టీడీపీ ఆగ్రహం

● ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ జీఓ కాపీలు చించి నిరసన, మంత్రాలయంలో దగ్ధం
● పద్మశాలీలతో ఆత్మీయ సమ్మేళనం
● గోనెగండ్ల మండలంలో విస్తృత ప్రచారం




ఎమ్మిగనూరు, మంత్రాలయంలో జీఓ ప్రతులను చించి దగ్ధం చేస్తున్న ఎంపీ సంజీవ్‌కుమార్, బీవీ, రాష్ట్రనాయకులు దేవెళ్ల మురళి

ఎమ్మిగనూరు, మే 10 : రాష్ట్ర ప్రజలకు, రైతులకు గుదిబండగా వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్‌టైటిల్ యాక్ట్‌పై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మిగనూరు, మంత్రాలయంలో వేర్వేరుగా జీవో ప్రతులను చించి దగ్ధం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మిగనూరులో కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్‌తో కలిసి టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి జీఓ ప్రతులను చించివేసి నిరసన తెలపగా మంత్రాలయంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి, నాయకులు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో జీఓ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆస్తులను, భూములను వైసీపీ నాయకులు కొట్టేసేందుకే ఈ యాక్ట్‌ను తీసుకువచ్చారని మండిపడ్డారు. రైతుల భూముల పాసుపుస్తకాలపై రైతుల ఫొటోలు కాకుండ జగన్ ఫొటో ఎలా ముద్రిస్తారని ప్రశ్నించారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ యాక్ట్‌ను రద్దు చేయడం జరుగుతుందన్నారు. రైతులు, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనం

పద్మశాలీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎంపీ సంజీవ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీవీ, ఎంపీ సంజీవ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పద్మశాలీల ఉపాధి అవకాశాలు మెరుగుపడాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ ఎన్నికల్లో అందరూ ఐక్యంగా టీడీపీకి అండగా ఉండి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సంఘం నాయకులు శివదాసు, మాకం నారాయణ, క్యాబర్సి శ్రీనివాసులు, ఈరన్న, అన్నపూర్ణమ్మ, గోవిందు, ఎన్డీయే కూటమి నాయకులు నరసింహులు, భాస్కర్ పాల్గొన్నారు.

గోనెగండ్లలో బీవీ రోడ్‌షో

గోనెగండ్ల: ఏపీ సీఎం జగన్ ప్రజాభక్షకుడిగా మారాడని ఇక ఆయనను ఇడుపులపాయకు సాగనంపే సమయం దగ్గర పడిందని ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దమరివీడు, చిన్నమరివీడు గ్రామాల్లో పర్యటించారు. పలు వీధుల్లో కలియతిరిగి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం మండల కేంద్రంలో రోడ్డు షో నిర్వహించారు. మక్కా మసీద్, పెద్దమసీద్, ఇద్గామసీద్‌ల దగ్గర బీవీ జయనాగేశ్వరరెడ్డి ముస్లింలను కలిసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మైనార్టీ పెద్దలు బీవీని పూలమాలలతో సన్మానించారు.




చేనేతల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి, గోనెగండ్లలో బీవీని సన్మానిస్తున్న ముస్లింలు

వైసీపీ వార్డు మెంబర్‌ల చేరిక

అగ్రహారం గ్రామానికి చెందిన వైసీపీ గ్రామ వార్డు సభ్యులు బుదిగి హనుమంతు, కురవ ఉల్లెప్ప, బసన్న, సుధాకర్, వీరేష్, జనార్ధన్, తిమ్మప్పలతో పాటు మరో 50 కుటుంబాలు వైసీపీని వీడి బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

ఆశీర్వదించి అండగా నిలవండి





మంత్రాలయంలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు, ఎం. తండాలో రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న మహిళలు, వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న సజ్జలగుడ్డం దళిత నాయకులు

● మార్పు మొదలైంది.. బాబు సీఎం కావడం ఖాయం
● ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని ఇంటికి పంపుదాం
● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి
● మంత్రాలయంలో టీడీపీ భారీ ర్యాలీ
● సజ్జలగుడ్డంలో వైసీపీకి దళితవర్గాలు షాక్

మంత్రాలయం, మే 10: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే అవకాశం వచ్చింది.. అండగా నిలిచి ఆదరించండి అంటూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి ఓటర్లను కోరారు. మూడుసార్లు గెలిచి ఆస్తులు కూడబెట్టుకున్న బాలనాగిరెడ్డి ఇక నీ సేవలు చాలు ఇంటికి దయచేయండని సాగనంపండని ప్రజలను కోరారు.

శుక్రవారం మండలంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, ఐక్యవాల్మీకి పోరాట కమిటి రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ రాయలసీమ కన్వీనర్ లక్ష్మన్న, నియోజకవర్గ పరిశీలకులు దేవళ్ల మురళితో కలిసి రాఘవేంద్రరెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని బూదూరు, వి.తిమ్మాపురం, మాధవరం తండా, మంత్రాలయం గ్రామాల్లో వారు పర్యటించారు. వి.తిమ్మాపురంలో అంబేడ్కర్, వాల్మీకి మహర్షి విగ్రహాలకు నివాళి అర్పించారు. మంత్రాలయం పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి రాఘవేంద్ర సర్కిల్, మహాముఖద్వారం మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. వీరికి కూటమి శ్రేణుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఎం.తండాలో జగద్గురు సేవాలాల్‌ను దర్శించుకుని మొక్కుల అనంతరం అక్కడి మహిళలు మంగళహారతులు చేసి పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పు మొదలైంది.. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అఖండ విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. అందరితోడ్పాటుతో నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పన్నగ వెంకటేశ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, ముని నాయక్, చంద్రలోక్ నాయక్, నారాయణ నాయక్, గణపతి నాయక్, తులసప్ప, తిరుమల్ నాయక్, గోవిందు నాయక్, ఎస్‌ఎం గోపాల్ రెడ్డి, రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, చంద్ర, లక్ష్మన్న, వీరేష్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని టీడీపీ కార్యాలయంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్టు జీవో ప్రతులను టీడీపీ నేతలు దగ్ధం చేసి నిరసన తెలిపారు.

కోసిగిలో వైసీపీ నాయకుల చేరిక

కోసిగి : కోసిగిలోని 3వ వార్డు ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ ఉప సర్పంచు బంధువులు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

సజ్జలగుడ్డంలో వైసీపీకి దళితవర్గాలు షాక్

మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామానికి చెందిన 50 దళిత వైసీపీ కుటుంబాలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సోదరుడు రఘునాథరెడ్డి, టీడీపీ పార్టీ పరిశీలకులు దేవళ్ల మురళి సమక్షంలో టీడీపీలో చేరారు. ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి సన్నక్కి హనుమంతు, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు తగరం నరసింహులుతోపాటు మరో 50 కుటుంబాలు టీడీపీలో చేరడంతో సజ్జలగుడ్డంలో వైసీపీకి దళితులు పెద్ద షాక్ ఇచ్చారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి




పద్మశాలి సంఘ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న డా పార్థసారధి

ఆదోని, మే 10: ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించండి... ఆదోని అభివృద్ధి చేసి చూపిస్తానని ఎన్డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారధి అన్నారు. శుక్రవారం ఆర్టీసీ కాలనీలోని ప్రజలను ఓటును అభ్యర్థించాడు. అనంతరం పద్మశాలి సామాజికవర్గంతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆదోని మండలం మదిరె గ్రామంలో ఇంటింటికీ పర్యటించి ఓటును అభ్యర్థించి, అక్కడి పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆదోని నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడే వ్యక్తిగా, తాగు, సాగునీరు సక్రమంగా విడుదల చేసే విధంగా చూస్తానన్నారు. గ్రామాల్లో తాగునీటితో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే అయిన మరుక్షణమే వీలైనంత వరకు నిధులు తెప్పించి పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఇన్నేళ్లుగా ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని గెలిపించినా, ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని, నియోజకవర్గం అభివృద్ధిలో వెనకబడిందని ఆరోపించారు. ఒక్క అవకాశం ఇస్తే తానేంటో నిరూపించుకుంటానని ప్రజలను కోరారు.

నేడు జేపీ నడ్డా ఆదోని రాక

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శనివారం ఆదోనిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ బహిరంగ సభకు హాజరవుతున్నట్లు బీజేపీ ఎన్నికల పరిశీలకులు పేరాల శేఖర్, రాష్ట్ర నాయకుడు విట్టా రమేష్ తెలిపారు. మునిసిపల్ క్రీడామైదానంలో జేపీ నడ్డా బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా మాజీ అధ్యక్షుడు రామస్వామి, మలేకర్ శ్రీనివాసులు, నాగరాజు గౌడ్, శ్రీనివాసాచారి పరిశీలించారు. అభ్యర్థి డాక్టర్ పీవీ పార్థసారధి పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజును గెలిపించాలని బహిరంగ సభలో మాట్లాడుతారు. బహిరంగా సభకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు భారీగా జన సమీకరణ గ్రామాల్లో, వార్డుల్లో ఏర్పాట్లు సన్నాహాలు చేస్తున్నారు.

నీటి కోసం రోడ్డుపై బైఠాయింపు

● వైసీపీ మండల ఇన్‌చార్జి మురళిరెడ్డిని నిలదీసిన కాలనీవాసులు



కోసిగిలో నీటి కోసం రోడ్డుపై బైఠాయించిన జనం

కోసిగి మే 10: ; "వారం రోజుల నుంచి కాలనీలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. కనీసం గంట కూడా నీరు వదలడం లేదు.. ఎలా గడపాలి.. ఎలా మా దాహార్తిని తీర్చాలి' అంటూ దుర్గానగర్‌లోని కాలనీకి చెందిన కాలనీవాసులు శుక్రవారం ప్రచారానికి వచ్చిన వైసీపీ మండల ఇన్‌చార్జి మురళిరెడ్డిని చుట్టుముట్టి నిలదీశారు. కాలనీ నుంచి గెలిచిన వార్డు మెంబరు కనీసం తాగునీటి సమస్యను పరిష్కరించలేదని, సర్పంచు ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చారే గానీ, ఇంత వరకు తాగునీటి సమస్యను పరిష్కరించలేదని మురళిరెడ్డిని నిలదీశారు. మంత్రాలయం ఎమ్మెల్యే, అభ్యర్థి బాలనాగిరెడ్డి శుక్రవారం సాయంత్రం రోడ్‌షో నిర్వహించారు. ఈ రోడ్‌షోకు తమ సమస్యను విన్నవించుకోవలని ఖాళీ బిందెలతో కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి దుర్గానగర్ దళితులు నిరసన తెలిపారు. సమస్య తీవ్రరూపం దాల్చడంతో ఏమి చేయలేక వైసీపీ నాయకులు అక్కడి నుంచి ఏదో ఒకటి చెప్పి జారుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సతీష్ కుమార్, పోలీసు సిబ్బంది ఎమ్మెల్యే రోడ్‌షోకు ఇబ్బదులు కలగకుండా ముందుస్తుగా కాలనీముందు ధర్నా చేస్తున్న మహిళలను, కాలనీవాసులను అడ్డుకుని వారిని శాంతింపజేశారు.

టీడీపీదే అధికారం

● టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్
● ఆస్పరిలో వైకుంఠం దంపతులకు ఘనస్వాగతం
● ఎండవేడిమికి వైకుంఠం అస్వస్థత ఆసుపత్రికి తరలింపు
● మొలగవల్లి వైసీపీ నాయకులు టీడీపీ చేరిక
● హత్తిబేళగల్‌లో మల్లికార్జున గౌడ్‌ప్రచారం

ఆస్పరి/హొళగుంద, మే 10 : సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీదే అధికారం అని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు వచ్చిన వైకుంఠం శివప్రసాద్, జ్యోతికు ఘనస్వాగతం లభించింది. పార్టీశ్రేణులు, అభిమానులు భారీ గజమాలతో దంపతులను సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఆస్పరిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక బీసీ, ఎస్సీ కాలనీలతో పాటు ప్రధాన వీధుల్లో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించి వీరభద్రగౌడ్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. రాష్ట్రం నుంచి వైసీపీ కనుమరుగయ్యే విధంగా తీర్పునివ్వాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్, సర్పంచ్ అంజినేయ, ఎంపీటీసీ నరసప్ప, గోవిందు, సంజప్ప, శేషిరెడ్డి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజల భూములకు ఎసరు పెట్టి జగన్‌ను ఓడించండి

హొళగుంద : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజలకు భూములు ఖాజేసేందుకు కుట్రపన్నిన జగన్‌ను చిత్తుగా ఓడించాలని టీడీపీ నేత వైకుంఠం జ్యోతి, రాజాగౌడ్ అన్నారు. హొళగుందలోని బీసీ కాలనీలో కూటమి అభ్యర్థి వీరభద్రగౌడ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు.



వైకుంఠం దంపతులకు గజమాలతో స్వాగతం పలుకుతున్న ఆస్పరి వాసులు

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాడని మండి పడ్డారు. ప్రజలు టీడీపీకి పట్టం కట్టేందుకు సిద్ధం అయ్యారని స్పష్టం చేశారు. మండల కన్వీనర్ తిప్పయ్య, తోక వెంకటేష్, కాకి సీతయ్య, మైనారిటీ నాయకుడు ఆదాం, వీరన్న గౌడ్, జనసేన నాయకుడు అశోక్, చిన్న పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుతోనే ఆలూరు అభివృద్ధి

టీడీపీ గెలుపుతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ కుమారుడు మల్లికార్జున గౌడ్ అన్నారు. ఆలూరు మండల హత్తిబేళగల్ గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాబోతుందని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీను చంద్రబాబు నాయుడు నెరవేరుస్తామని అన్నారు. అనంతరం గ్రామపెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి, ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో టీడీపీ సైకిల్ గుర్తుకే మీ ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మొలగవల్లి వైసీపీ నాయకులు టీడీపీ చేరిక

ఆలూరు రూరల్ : టీడీపీ కర్నూలు పార్లమెంటు అభ్యర్థి పంచలింగాల నాగరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి కటారుకొండ శీనప్ప, కురవ రామంజినేయులు ఆధ్వర్యంలో మొలగవల్లికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. కురవ సామాజికవర్గానికి చెందిన నాయకులు బెలగంటి హనుమప్ప, వార్డు మెంబర్ నగిరి వెంకన్న, నగిరి దేవేంద్రప్ప, కిషోర్, హనుమన్న, వీరేశ్, పచ్చరి మారుతితో పాటు 30 కుటుంబాలు తెలుగుదేశం కండువాలు కప్పుకున్నారు. టీడీపీ పార్లమెంటు అభ్యర్థిగా తనను, టీడీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థిగా వీరభద్రగౌడ్‌ను ఆదరించి గెలిపించాలని పంచలింగాల నాగరాజు కోరారు.



వైకుంఠం శివప్రసాద్‌కు అస్వస్థత

టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైంకుఠం శివప్రసాద్ శుక్రవారం ఆస్పరిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ఎండ వేడిమికి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన భార్య వైకుంఠం జ్యోతి, టీడీపీ నాయకులు హుటాహుటిన ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ కుమారుడు నాయకులు గిరి మల్లేష్ గౌడ్ ఆసుపత్రికి చేరుకొని ఆయనను పరామర్శించారు.



వైకుంఠం శివప్రసాద్‌ను పరామర్శిస్తున్న గిరి మల్లేష్ గౌడ్

జనాల భూములకు రక్షణ లేదు

● మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు
● పత్తికొండపై తెలుగుదేశం జెండా ఎగరేస్తాం
● క్రిష్ణగిరి మండలంలో విస్తృత పర్యటన
● తుగ్గలి మండలంలో టీడీపీ శ్రేణుల ఇంటింటి ప్రచారం
● చిట్యాల, మద్దికెరలో వైసీపీ నాయకుల చేరిక






తొగర్చేడు గ్రామంలో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు, రాంపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కేఈ రుద్రగౌడు, కేఈ ప్రభాకర్, మాజీ డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి సమక్షంలో టీడీపీలో చేరుతున్న చిట్యాల గ్రామస్థులు

క్రిష్ణగిరి, మే 10: భూ యాజమాన్య హక్కు చట్టంతో తాత ముత్తాతల నుంచి వస్తున్న మన భూములను జగన్ కాజేసే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ పత్తికొండ అభ్యర్థి కేఈ శ్యాంబాబు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం వారు కూటమి నాయకులు కోట్ల రాఘవేంద్రారెడ్డి, లక్కసాగరం లక్ష్మీరెడ్డితో కలసి పందిర్లపల్లె, లక్కసాగరం, లాల్‌మాన్‌పల్లె, తెగదొడ్డి, ఆలంకొండ, కటారుకొండ, బోయ బొంతిరాళ్ల, ఎర్రబాడు, మన్నెకుంట, ఎస్.హెచ్ ఎర్రగుడి, క్రిష్ణగిరి, తొగర్చేడు, టీ.గోకులపాడు, చిట్యాల గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దొంగచట్టాలను రద్దు చేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రజలందరి సహకారంతో పత్తికొండపై తెలుగుదేశం జెండా ఎగరేయడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు నబిసాహెబ్, ఎల్వీ ప్రసాద్, మర్రి శ్రీరాములు, గురుస్వామి, మహమ్మద్ రఫి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల గ్రామస్థుల చేరిక

కంబాలపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, కేఈ జయన్న సమక్షంలో చిట్యాల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు.

మద్దికెరలో పంచాయతీ సభ్యుల చేరిక

మద్దికెర : మద్దికెరలోని వైసీపీకి చెందిన 16వ పంచాయతీ సభ్యులు బెస్త సుధాకర్‌తో పాటు హరిక్రిష్ణ, గోవిందరాజు, తిరుమలేషు, బద్రిలతో కలిసి మరికొంత మంది యువకులు టీడీపీ మండల ఇన్‌చార్జి కేఈ దివాకర్, టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాలకృష్ణ, భీమరాజు, సుగ్గలప్ప, రైతులు ఉన్నారు.

ఆర్.కొట్టాల, రాంపురంలలో ప్రచారం

తుగ్గలి : మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ తనయుడు మండల ఇన్‌చార్జి కేఈ రుద్రగౌడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు మండల పరిధిలోని ఆర్.కొట్టాల, రాంపురం గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పార్టీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజులకు సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. టీడీపీ నాయకులు మిద్దె వెంకటేశ్ యాదవ్, వెంకట్రాముడు చౌదరి, మాజీ సర్పంచ్ చంద్రన్న ఉన్నారు.